నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

ప్రకృతి కాన్వాస్‌పై చిత్ర రేఖ..

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ప్రత్తిపాడుకు చెందిన సీనియర్ ఫోటోగ్రాఫర్ సలాది కృష్ణ తీసిన అనేక ఫొటోలకు జాతీయ అంతర్జాతీయ స్థాయి అవార్డులు పురస్కారాలు అందుకున్నారు. సోమవారం 183వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆయన తీసిన చిత్రాలను పంచుకున్నారు.

'స్వయం ఉపాధి' కల్పిస్తారా..?

- సబ్సిడీ రుణాలకు గత ప్రభుత్వం మంగళం
- కూటమి సర్కారుపై ఆశలు
- ఆశావహుల ఎదురు చూపులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

2019 నుంచి 2024 వరకూ రాష్ట్రంలో పాలన సాగించిన వైసిపి ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాల మంజూరును పూర్తిగా మంగళం పాడింది. అంతకుముందు అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల ద్వారా ప్రతీ ఏడాది గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని ఆయా సామాజిక వర్గాల వారీగా సబ్సిడీ రుణాలను అందచేసింది. ఇదే విధానం గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడూ అమలు చేసింది. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ సర్కార్ ఎంతో ఆర్భాటంతో కులాల వారీ కార్పొరేషన్లను ఏర్పాటు చేసింది. ఆయా కార్పొరేషన్లకు ఛైర్మన్లు, ఛైర్‌పర్సన్లు, డైరెక్టర్లను నియమించింది. అయితే ఆయా కార్పొరేషన్ల ద్వారా ఉపాధి కల్పనకు అవసరమైన చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలం అయింది. వివిధ కార్పొరేషన్లకు పాలకవర్గాలను నియమించినా కనీసం వారికి కార్యాలయాలను ఏర్పాటు చేసిన పరిస్థితి లేకుండా పోయిందని పాలకవర్గాల ప్రతినిధులే తమ అసంతృప్తిని వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు సబ్సిడీ రుణాలను అందిస్తారని అనేక మంది ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు.

గ్రామాలు, పట్టణాల్లో ఉపాధి లేక ఇబ్బందులను ఎదుర్కొంటున్న వారికి ఉపాధి కల్పించే లక్ష్యంతో 2019కి ముందు పాలన సాగించిన కాంగ్రెస్, టిడిపి ప్రభుత్వాలు వివిధ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీపై రుణాలను బ్యాంకుల ద్వారా ఇప్పించాయి. అర్హులైన వారు ఎంచుకున్న యూనిట్‌ను బట్టి గరిష్టంగా రూ.లక్ష వరకు సబ్సిడీ పొందేందుకు అవకాశం ఉండేది. కిరాణా కొట్టు, బట్టల షాపు, ఫ్యాన్సీ దుకాణాలు, వెల్డింగ్, టెంట్ హౌస్, ఆటోలు, ఇలా పలు స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం చేయూతను అందించేది. ఆయా కార్పొరేషన్ల ద్వారా కొంత మొత్తాన్ని సబ్సిడీ ఇచ్చి మిగిలిన పెట్టుబడిన బ్యాంకుల ద్వారా అర్హులకు అందచేసేవారు. ప్రతీ ఏటా జిల్లాలో వేల మందికి ఈ యూనిట్లు అందడంతో వారందరికీ ఉపాధి లభించేది. అయితే 2019లో వైసిపి అధికారంలోకి రాకముందు ఎస్‌సి, బిసి, కాపు, మైనారిటీ, ఇతర కార్పొరేషన్ల ద్వారా 2019-20 ఆర్థిక సంవత్సరంలో మూడు జిల్లాల్లో అర్హుల నుంచి పెద్ద సంఖ్యలో దరఖాస్తులను ఆహ్వానించారు. బిసి కార్పొరేషన్ ద్వారా 2995 యూనిట్లు, ఇబిసి కార్పొరేషన్ ద్వారా 920 యూనిట్లు, బిసి ఫెడరేషన్ ద్వారా 1400, కాపు కార్పొరేషన్ ద్వారా 15వేల యూనిట్లు, ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా 5,420 యూనిట్లు, మైనార్టీ ద్వారా 4,506 యూనిట్లు, క్రిస్టియన్ కార్పొరేషన్ ద్వారా 349, వైశ్య కార్పొరేషన్ ద్వారా 17 యూనిట్ల కోసం దరఖాస్తులను అధికారులకు అందచేశారు. ఇంతలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఆ దరఖాస్తులకు రుణాలు మంజూరు చేసిన పరిస్థితి లేదు. అయితే 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎవరూ ఊహించని ఆధిక్యంతో వైసిపి అధికారాన్ని కైవసం చేసుకుంది. వైఎస్ జగన్మోహన్ రెడ్డి సిఎంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. అయితే అప్పటికే ఎస్‌సి, బిసి, ఇబిసి, కాపు, మైనార్టీ, క్రిష్టియన్, వైశ్య కార్పొరేషన్‌ల ద్వారా సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు చేసుకున్న వేలాది మంది ఆయనపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే ఆ ఆశలన్నీ వైసిపి ఐదేళ్ల పాలనలో అడియాశలే అయ్యాయి. ఐదేళ్ల పాలనలో సబ్సిడీ రుణాల మంజూరు చేసే అంశానికి పూర్తిగా మంగళం పాడేసింది. సబ్సిడీ రుణం తీసుకుని ఏదో ఒక స్వయం ఉపాధి పొందుదామనుకున్న నిరుద్యోగ యువతకు నిరాశే మిగిలింది. ఏ ఒక్క కార్పొరేషన్ కిందా ఒక్క సబ్సిడీ రుణం కూడా మంజూరు కాలేదు. ముఖ్యమైన ఒక్కో కులానికి ఒక్కో కార్పొరేషన్ ఏర్పాటు చేసినప్పటికీ రుణాలు ఇవ్వలేదు. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా కార్పొరేషన్లు మరాయని అప్పట్లో విమర్శలు వచ్చాయి. వేల సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై నిరుద్యోగులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఆయా కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలను మంజూరు చేసి నిరుద్యోగ యువతకు, ఔత్సాహికులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందనే నమ్మకంతో ఎదురు చూస్తున్నారు.

గడియార స్తంభం సెంటర్లో ఎంఎల్‌సి ఐవి, యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ, ప్రజా సంఘాల నాయకుల నిరసన

నిందితులను కఠినంగా శిక్షించాలి

'కోల్‌కతా' ఘటనపై యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి-అమలాపురం

కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్యకు పాల్పడిని నిందితులను చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్), భారత విద్యార్థి ఫెడరేషన్, ప్రజాసంఘాలు డిమండ్‌చేశారు. వీరి ఆధ్వర్యంలో ఆదివారం అమలాపురం గడియార స్తంభం సెంటర్ వద్ద నిరసన తెలిపి అనంతరం క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ళ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైద్యురాలిపై అత్యాచారం, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. దీని వెనక సెక్స్ మానవ అవయవ ముఠా, మందుల ముఠా దాగి ఉందని అత్యాచారానికి గల కారణాలని కోల్‌కతా హైకోర్టు స్పష్టంగా చెబుతున్నప్పటికీ పశ్చిమబెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం తగిన విధంగా స్పందించకపోవడం హాస్యాస్పదమన్నారు. తక్షణం ఈ ఘటన వెనక ఉన్న ముఠాని గుర్తించి వారందరినీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సంచలనం రేపుతున్న వైద్యురాలిపై అత్యాచారం, హత్య వెనుక వాస్తవాలను బయటికి రాకుండా పశ్చిమబెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం అడ్డుపడుతోందన్నారు. దీని వెనక దాగి ఉన్నటువంటి వారందరినీ బయటకు తీసి కఠినంగా శిక్షించాలన్నారు. యువత పెడదారులకు గురి చేసేటువంటి అశ్లీల వెబ్సైట్లను నియంత్రించే పని కేంద్ర ప్రభుత్వం చేయాలని ఆ పని కేంద్ర ప్రభుత్వం చేయడం లేదని వాపోయారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పెంకె వెంకటేశ్వరావు ఎంటివి సుబ్బారావు మాట్లాడుతూ మహిళలు పై అత్యాచారాలు ఈ కాలంలో విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. వీటిని నియంత్రించే దాంట్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యయని అన్నారుర. ప్రభుత్వం, సమాజం కూడా ఇటువంటి ఘటన పునరావతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా డ్యూటీలో ఉన్న మహిళా డాక్టర్లు, నర్సులు సిబ్బంది అందరికీ ప్రభుత్వం రక్షణ కల్పించాలని ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న వారంతా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పెంకె వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎంటివి.సుబ్బారావు, జిల్లా కార్యదర్సులు పెన్నాడ శ్రీనివాస్, బి.చంద్రకళ, కుడుపూడి శ్రీనివాస్, వై.మురళి కష్ణ, ఎస్ఎఫ్ఐ నాయకులు కె.శంకర్ శశి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కారెం వెంకటేశ్వరరావు,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఏటిగట్టు రహదారి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం నుంచి జొన్నాడ వెళ్లాలంటే ఏటిగట్టు రహదారి గుంతలతో ప్రమాదకరంగా మారింది. ఈ ఏటిగట్టు రహదారి పై ప్రయాణం చేయాలంటే వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ప్రతిరోజు రద్దీగా ఉండే ఈ రహదారి మీదుగా వెళ్లాలంటే ఏ ప్రమాదం ముంచు కొస్తుందో అని ప్రయాణికులు వాహనదారులు ఆందోళన చెందుతున్నారు అందులోనూ ఏటిగట్టు రహదారి కావడం వల్ల, ఆదమరిస్తే ఒకపక్క గోదావరి, ఇటు కాలువ, అటు గుంతలు ఏర్పడడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయని ప్రజల వాపోతున్నారు. ఏటి గట్టు రహదారిలో గోతులు ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు మీదిగా రావులపాలెం, జొన్నాడ, యానం, కోటిపల్లి, తదితర గ్రామాలకు వెళ్లాలంటే ప్రతి నిత్యం ఈ రహదారి మీదు గా ప్రయాణాలు సాగిస్తూ ఉంటారు. రహదారిపై ప్రయాణాలు సాగిస్తున్న వాహన దారులకు ఎటువంటి ప్రమాదాలు జరగకముందే సంబంధిత అధికారులు గోతులు పూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గోతులమయంగా కపిలేశ్వరపురం ఏటి గట్టు రహదారి

నేడు యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-అమలాపురం

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ఆగస్టు 19 సోమవారం స్థానిక కలెక్టరేట్లో గోదావరి భవన్ నందు ఉదయం 10 గంటల నుంచి యథావిధిగా నిర్వహిస్తారని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి,తగుపరిష్కార మార్గాలు పొందాలన్నారు.

'జన విజ్ఞానం' ఆన్‌లైన్ పత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమలాపురం

స్వాతంత్ర్య దినోత్సవం రోజు ప్రారంభించబడిన జన విజ్ఞాన వేదిక ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో అప్లోడ్ చేసిన జన విజ్ఞానం ఆన్లైన్ పత్రికను ఆదివారం అమలాపురం ఎంప్లాయీస్ హోమ్‌లో ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం ఎంఎల్‌సి ఐవి మాట్లాడుతూ జన విజ్ఞానం పత్రిక నూతన శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం పనిచేసే పీపుల్స్ సైన్స్ ఉద్యమ కార్యకర్తలు, సామాజాభివద్ధి కానుకులకు కరదీపికగా ఉపయోగపడుతుందని అన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధానకార్యదర్శి ఖాజా మొహిద్దీన్ మాట్లాడుతూ ఈ పత్రిక కొన్ని రోజుల వరకు మొబైల్ ఫ్రెండ్లీగా ఉండి కొంతకాలం తరువాత ఆఫ్లైన్ లో హార్డ్ కాపీలు వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్చార్జి అధ్యక్షులు జె సత్యనారాయణ, జిల్లా చెకుముకి కన్వీనర్ ఎన్.అబ్బులు, జెవివి జిల్లా ఆడిటర్ బిఎన్‌విరావు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, ఎపిఆర్‌పిఎ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సత్యనారాయణ, జివి. గోపాలకృష్ణ, పెన్షనర్స్ పి.భాస్కరరావు, వివిఆర్‌కె. అర్జునరావు, కుడుపూడి రాంబాబు, బియన్. వెంకటేశ్వర రావు, ఐ.సాంబ శివ రావు, కె.గంగాధరరావు, జెవివి నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌సి ఐవి, జెవివి నాయకులు

స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో ముందుకు సాగాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షురామ్మోహన్

ప్రజాశక్తి-అమలాపురం

విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తిని స్మరించుకుంటూ ముందుకు సాగాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్ అన్నారు. అమలాపురం స్థానిక యుటిఎఫ్ హోమ్ నందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతుల ప్రదానం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సమాజం పట్ల సమాజంలో వస్తున్న మార్పులు పట్ల అవగాహన కలిగి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. తర్వాత ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎంటివి సుబ్బారావు, యుటిఎఫ్ సీనియర్ నాయకులు బిఎన్.వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరావు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానంచేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్ఎఫ్ఐ కన్వీనర్లు కె.శంకర్, శశి, రిత్విక్, సంతోష్, సంజన తదితరులు పాల్గొన్నారు.

పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం

రసాభాసగా తాలూకా శెట్టిబలిజ సంఘ సమావేశం

వివాదాలతో ఎన్నిక వాయిదా

పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం

ప్రజాశక్తి-రామచంద్రపురం

ఆదివారం నిర్వహించిన తాలూకా శెట్టిబలిజ సంఘ సమావేశం రసాభాసగా మారింది. నియోజకవర్గంలో బలీయమైన ఓటు బ్యాంకు కలిగిన శెట్టిబలిజ సామాజిక వర్గం తాలూకా శెట్టిబలిజ సంఘం ఏర్పాటు చేసుకుని ఎన్నో ఏళ్లుగా దానిని కొనసాగిస్తున్నారు. ఇటీవల ఎన్నికల అనంతరం తాలూకా శెట్టి ప్రజల సంఘం స్తబ్ధు గా ఉండటంతో బిసి సామాజిక వర్గంలోని యువకులంతా ఇటీవల శెట్టిబలిజ సంఘం నూతన కార్యవర్గం ఎంపిక చేసుకున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో తాలూకా శెట్టి ప్రజల సంఘం అధ్యక్షులైన కట్ట సూర్య నారాయణ తో పాటు శెట్టిబలిజ సంఘం పెద్దలు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ కార్యక్రమానికి హాజరు అయ్యారు. రాజకీయ నేపథ్యంలో వివాదాలు వద్దని సమస్యలన్నీ సానుకూలంగా పరిష్కరించుకోవాలని వివాదాలు లేకుండా నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవాలని సూచించారు. అయితే ఇటీవల ఎంపికైన నూతన కమిటీ సభ్యులు దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. అదేవిధంగా మాజీ సంఘ అధ్యక్షుడు అయినా కట్ట సూర్యనారాయణ పైన దాడికి దిగడంతో సభ రసాభాసగా మారింది. దీంతో వాదోపవాదాలు మొదలై ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న డిఎస్‌పి, సిఐ ఆధ్వర్యంలో సంఘటనా స్థలానికి చేరుకుని ఎన్నికను తరువాత నిర్వహించుకోవాలని వివాదాలు లేకుండా అందరూ సమావేశం నుంచి నిష్క్రమించాలని సూచించారు. దీంతో నూతన కార్యవర్గం ఎంపిక నిర్వహించకుండా సమావేశం వాయిదా పడింది.

తాలూకా శెట్టిబలిజ సంఘ సమావేశం

'నవోదయ'కు నేతాజీ స్కూల్ విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి-ఆలమూరు

మండలంలోని చెముడులంక నేతాజీ(ఇఎమ్) స్కూల్ విద్యార్థి జవహర్ నవోదయకు ఎంపికైంది. ఈ క్రమంలోనే 2024 - 25 విద్యా సంవత్సరానికి విద్యార్థిని గంధం రిషిక స్వరాణి ఎంపికయినట్లు నేతాజీ స్కూల్ కరస్పాండెంట్ తుమ్మా శ్రీనివాసరావు తెలిపారు. స్కూల్ వద్ద ఏర్పాటుచేసిన అభినందన సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ స్కూలు ప్రారంభించి ఇప్పటికే 21 మంది విద్యార్థులను నవోదయకు ఎంపికయ్యారని అన్నారు. వారంతా ఎల్‌కెజీ నుంచి నేతాజీ స్కూల్ లోనే విద్యను అభ్యసిస్తు ఈ ఘనత సాధించినట్లు తెలిపారు. పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు అర్థమెటిక్, రీజనింగ్, ఇంగ్లీష్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చినందున తను జవహర్ నవోదయలో ఉతీర్ణురాలు అయినట్లు విద్యార్థిని రిషిక తెలిపింది. నవోదయకు ఎంపికైన విద్యార్థినిని కరస్పాండెంట్ శ్రీనివాసరావుతో పాటు పాఠశాల ఇంచార్జి దూలం స్వామి, వైస్ ప్రిన్సిపల్ లక్ష్మి, టీచర్లు రాజశేఖర్, దుర్గ తదితరులు ఈ సందర్భగా అభినందించారు.

మృతుల కుటుంబాలకు నాయకుల పరామర్శ

పొత్తూరి కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ హరీష్

ప్రజాశక్తి-యంత్రాంగం

వివిధ కారణాలతో ఇటీవల పలువురు మృతి చెందారు. మృతుల కుటుంబ సభ్యులను ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు ఆదివారం పరామర్శించారు

ముమ్మిడివరం: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ పొత్తూరి విజయభాస్కర వర్మ కుటుంబ సభ్యులను అమలాపురం ఎంపి గంటి హరీష్ మాధుర్ ఆదివారం పరామర్శించారు. మండలంలోని చిన కొత్తలంక గ్రామానికి చెందిన విజయ్ భాస్కర వర్మ ఇటీవల మృతి చెందారు. ఆదివారం ఎంపి హరీష్ తదితరులు మృతుడు భాస్కర వర్మ కుటుంబ సభ్యులను పరామర్శించి, పార్టీ అండగా ఉంటుందని భరోసా నిచ్చారు. ఈ సందర్భంగా విజయ్ భాస్కర వర్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చెల్లి అశోక్ అర్ధాని శ్రీనివాసరావు, చిక్కాల అంజిబాబు, వీపూరి సత్యనారాయణ రాజు, గిసాల చంద్రరావు, దాసరి సాయిబాబు, బొంతు నాగరాజు, చింతలపూడి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: అమలాపురానికి చెందిన టిడిపి నాయకుడు గంధం పల్లంరాజు తండ్రి సత్తిరాజు ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని ఆదివారం మండలానికి చెందిన కూటమి నాయకులు పరామర్శించారు. సత్తిరాజు చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పల్లంరాజు కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో తెలుగు యువత నాయకులు మద్దింశెట్టి సురేష్, అరిగెల నరేష్, కడలి శ్రీనివాసరావు, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు చీకట్ల ఏసుబాబు, జనసేన నాయకులు సలాది నాగరాజు, పైబోడి వీరేంద్ర తదితరులున్నారు.

ఆలమూరు: మాతృ వియోగంతో బాధపడుతున్న స్థానిక జనసేన నాయకులు బైరిశెట్టి రాంబాబు (కరెంట్ రాంబాబు)ను, కుటుంబ సభ్యులను కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ ఆదివారం పరామర్శించారు. రాంబాబు మాతృమూర్తి కృష్ణవేణి ఇటీవల మృతి చెందారు. కృష్ణవేణి మృతి పట్ల బండారు శ్రీనివాస్ సంతాపం వ్యక్తం చేశారు. రాంబాబును పరామర్శించిన వారిలో జనసేన పార్టీ నాయకులు సూరపురెడ్డి సత్య, సలాది జయప్రకాష్ నారాయణ, కొత్తపల్లి నగేష్, గారపాటి శ్రీనివాస్ చౌదరి, చల్లా వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు చీపురుపల్లి గణేష్, తదితరులు ఉన్నారు.

సత్తిరాజు చిత్రపటానికి కూటమి నాయకుల నివాళి



రాంబాబును పరామర్శిస్తున్న శ్రీనివాస్ తదితరులు

కార్టూ'నిజం'



జనావాసాలకు దూరంగా బస్‌షెల్టర్

దగ్గరలో నిర్మించాలంటూ స్థానికుల డిమాండ్

ప్రజాశక్తి- రాజోలు

రాజోలు నియోజకవరం ముఖ్య కేంద్రం రాజోలు మండలం శివకోడు గ్రామంలో జాతీయరహదారి 216 ఆధునీకరణ పనులలో భాగంగా రహదారి విస్తరణ చేశారు. శివకోడు గ్రామంలో కోనవారి గ్రూప్ లో సుమారు 100 కుటుంబాలు ఉన్నాయి. ఆగ్రూపునకు ఆనుకుని బస్ షెల్టర్ నిర్మించాలని పలుసార్లు అధికారులను కోరిన స్థానికులు వారి మాట పక్కన పెట్టి ఎలాంటి జన నివాసాలు లేని చోట, నివాసాలకు దూరంగా బస్ షెల్టర్లను నిర్మిస్తున్నారు. జాతీయరహదారి సిబ్బంది.దీ ంతో రహదారి దాటుకుని సుమారు 500 మీటర్ల దూరంలో నిర్మించిన బస్ షెల్టర్ వద్దకు వెళ్ళాలంటే స్థానిక ప్రజలకు అవస్థలు తప్పవు. కోనవారి గ్రూపుకి దగ్గరలో ఉన్న పెట్రోల్ బంకు పక్కన బస్ షెల్టర్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ గ్రూప్ వద్ద నుంచి పదుల సంఖ్యలో విద్యార్థులు పాఠశాలలకు, కళాశాలలకు వెళుతున్నారు. ఇలాంటి అత్యవసర ప్రదేశాలలో బస్ షెల్టర్ నిర్మించకుండా ఎలాంటి జన నివాసాలు లేని చోట్ల నిర్మించి తమను ఇబ్బందులకు గురిచేయవద్దని ఈ సందర్భంగా స్థానికులు కోరుతున్నారు.

శివకోడులో జనావాసాలకు దూరంగా నిర్మించిన బస్ షెల్టర్

జనావాసాలు లేనిచోట మరో షెల్టర్ నిర్మాణానికి ఏర్పాటు

డేవిడ్ రాజుకు ఘన సత్కారం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

కూనవరంలోని జీవము గల దేవుని సంఘం చర్చి పాస్టర్ పండు డేవిడ్ రాజును ఆదివారం సర్పంచ్ వాకపల్లి ఈశ్వరి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పాస్టర్ డేవిడ్ రాజు ఈనెల 11 నుంచి వారం రోజులు పాటు మలేషియా, దుబాయ్ దేశాల్లో జరిగిన అంతర్జాతీయ సెమినారుల్లో పాల్గొని స్వదేశానికి వచ్చిన సందర్భంగా సత్కరించారు. డేవిడ్ రాజుకు సర్పంచ్ ఈశ్వరి సత్యనారాయణ దంపతులు దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో సంఘ పెద్దలు పొద్దూకు సత్యానందం, శ్రీధర్, జాలెం శ్రీరామమూర్తి, వడ్డి కిషోర్ బాబు, వాకపల్లి సన్నిబాబు, పండు శ్రీరామ్మూర్తి, వడ్డి సత్యవతి, పరమట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



డేవిడ్ రాజును సత్కరిస్తున్న సర్పంచ్ ఈశ్వరి, సత్యనారాయణ దంపతులు

నిత్యాన్నదాన నిధికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-అయినవిల్లి

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అయినవిల్లి విఘ్నేశ్వర స్వామిని ఆదివారం ముమ్మిడివరానికి చెందిన ముళ్లపూడి శ్రీ గణేష్ కుటుంబ సమేతంగా దర్శించుని పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి నిత్యాన్నదాన నిధికి రూ.లక్ష విరాళంగా ఇచ్చినట్లు ఆలయ ఇఒ సతీష్‌రాజు, ఛైర్మన్ గుత్తుల నాగబాబు తెలిపారు. వీరికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి, శేష వస్త్రాలతో సత్కరించి, స్వామి వారి చిత్రపటమును బహూకరించారు.

దాతలకు విఘ్నేశ్వరుని చిత్రపటం అందిస్తున్న ఆలయ అర్చకులు

నేరాలు ఘోరాలు

స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

రూ.5 లక్షల విలువైన గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - రాజానగరం

జాతీయ రహదారిపై సుమారు రూ. 5 లక్షల విలువైన గంజాయి పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ఆదివారం రాజానగరం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉత్తర మండలం డిఎస్‌పి కె.శ్రీనివాస్ వివరాలను వెల్లడించారు. ఒక లారీలో విశాఖపట్నం జిల్లా ఏజెన్సీ ప్రాంతం నుంచి తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లాకు 20 కేజీల బస్తాలలో ఇద్దరు వ్యక్తులు గంజాయి తరలిస్తున్నారు. జాతీయ రహదారి మాధవి ఫంక్షన్ హాలు సమీపంలో పోలీసులు తనిఖీలు చేస్తుండగా గంజాయి తరలిస్తున్న లారీ పట్టుబడిందని డిఎస్‌పి తెలిపారు. ఇది 100 కేజీలు, విలువ రూ.5 లక్షలు ఉంటుందన్నారు. నిందితులు మరిముత్తు ఆరుముగమ్, వేల్ మురుగన్ అరెస్టు చేసినట్టు తెలిపారు. రెండు సెల్ ఫోన్లు, లారీ సీజ్ చేసినట్టు తెలిపారు. ఈ సమావేశంలో సిఐ ఎస్‌పి.వీరయ్యగౌడ్, ఎస్ఐ మనోహర్ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట ఆడుతూ పట్టుబడిన నిందుతులతో పోలీసులు

పేకాట శిబిరంపై పోలీసులు దాడి

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట శెట్టిబలిజపేట శివారులో జరుగుతున్న పేకాట శిబిరంపై ఎస్ఐ రఘునాథరావు తన సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురుని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.5,200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మండల పరిధిలో పేకాట, కోడిపందాలు వంటి జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఈ సందర్భంగా హెచ్చరించారు. ఎక్కడైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన ప్రజలను కోరారు.

బ్యాంకు కాలనీలో బైక్ చోరీ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక బ్యాంకు కాలనీలోని అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న ఆర్ అండ్ బి డిఇ ఎం.గణేశ్వరరావుకు చెందిన మోటార్ బైక్ చోరీకి గురైంది. ఈ మేరకు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సుమారు రూ.4 లక్షలు విలువచేసే బైక్‌ను శనివారం రాత్రి అపార్ట్‌మెంట్ కింద పార్కు చేసి ఆదివారం ఉదయం చూడగా కనిపించలేదని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

40 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - గోకవరం

సారా బట్టీలపై దాడి చేసి 40 లీటర్ల నాటు సారాను గోకవరం పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన కామరాజుపేటలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..మండలంలోని కామరాజుపేట గ్రామ శివారున సారా బట్టీ నిర్వహిస్తున్నారని అందిన సమాచారం మేరకు ఎస్ఐ పవన్ కుమార్, సిబ్బందితో ఆదివారం సారా బట్టీపై దాడి చేసి 40 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని 300 లీటర్లు బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు తెలిపారు. బట్టీ ప్రాంతం నుంచి యజమాని పరారైనట్టు తెలిపారు.

చెరువులో గల్లంతై వ్యక్తి మృత్యువాత

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

కొమరగిరి పంచాయతీ పరిధిలో ఉన్న చిన్న కలవల దొడ్డి చెరువులో ఒక వ్యక్తి గల్లంతై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..చిన్న కలవల దొడ్డి చెరువులో గేదెలు కడిగేందుకు వెళ్లిన దొంగల శ్రీను(48) చెరువులో ప్రమాదవశాత్తు గల్లంతై మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.వెంకటేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మరణం

ప్రజాశక్తి- ఆలమూరు

జాతీయ రహదారిపై 216(ఎ) శనివారం చొప్పెల్ల వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడిన ముగ్గురిలో అడబాల సత్యనారాయణ(57) కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం పరిస్థితి విషమించడంతో మతి చెందినట్లు ఎస్ఐ ఎం.అశోక్ తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట పిఠాపురం రైల్వే స్టేషన్ మధ్యలో గుర్తు తెలియని సుమారు 60 సంవత్సరాల వయసు గల వ్యక్తి రైలు కింద పడి మృతి చెందాడు. స్థానిక రైల్వే పోలీసుల కథనం ప్రకారం..ట్రైన్ లోకో పైలట్ ఇచ్చిన సమాచారం మేరకు పట్టాలు దాటుతుండగా వృద్ధుడిని రైలు ఢీకొట్టింది. అయితే మృతదేహం లభించిన తీరును బట్టి ఆత్మహత్యగా పోలీసులు భావిస్తున్నారు. మృతుని వంటిపై తెలుపు రంగు చొక్కాపై నల్లని గీతలు, నీలం రంగు లుంగీ, తెలుపు రంగు చెప్పులు ధరించి ఉన్నట్లు గుర్తించారు. మృతిని ఆచూకీ తెలిసిన బంధువులు ఉంటే సామర్ల కోట రైల్వే పోలీసులను సంప్రదించాలని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న రైల్వే ఎస్ఐ బి.లోవరాజు తెలిపారు.

రేషన్ డీలర్లకు పూర్వ వైభవం

ప్రజాశక్తి - కాకినాడ

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు మాధవరావు

రాష్ట్రంలో రేషన్ డీలర్లకు పూర్వ వైభవం రావాలని రాష్ట్ర డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు దివిలీలా మాధవరావు అన్నారు. ఆదివారం కాకినాడ అన్నదాన సమాజంలో కాకినాడ జిల్లా రేషన్ డీలర్ల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమా వేశానికి రాష్ట్రంలో పలు జిల్లా లకు చెందిన డీలర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రేషన్ డీలర్ల వ్యవస్థను నాశనం చేసేందుకే ఇంటింటికి వాహనాల ద్వారా బియ్యం పంపిణీ పథకాన్ని పెట్టిందన్నారు. దానివల్ల చాలా ఇబ్బందులు ప్రజలు ఎదుర్కొన్నారన్నారు. తాము ఈ వ్యవస్థను కాపాడుకునే ఉద్దేశంతో ప్రజలకు దగ్గర చేసేందుకు చాలా ప్రయత్నాలు చేశామన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థను గాడిలో పెట్టి డీలర్ గౌరవం నిలిపి వారికి ఇచ్చే గౌరవ వేతనం, కమిషన్ పెంచుతామని మహా కూటమి మేనిఫెస్టోలో పెట్టడంతో తామంతా ఆకర్షితులై కూటమిని గెలిపించామన్నారు. పట్టణాల్లో రూ.10 వేలు, గ్రామాల్లో రూ.7 వేలు గౌరవ వేతనం అందించి క్వింటాకు రూ.1.50 చొప్పున కమీషన్ ఇవ్వాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 29 వేలమంది రేషన్ డీలర్లు ఉన్నారని, మరో 10 వేల మందిని పెంచే అవకాశం ఉందని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. తమకు ఇబ్బంది లేకుండా కనీస కార్డుదారులను ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నెల 28న ఆల్ ఇండియా రేషన్ డీలర్ల సమావేశం విజయవాడలో జరుగు తుందని, దీనికి సీఎంతోపాటు, కేంద్ర ప్రభుత్వానికి చెందిన వారిని ఆహ్వా నించినట్లు చెప్పారు. కాకినాడ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు నందిపాటి పల్లయ్య మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో డీలర్లు చాలా కష్టాలు ఎదుర్కొన్నారని అన్నారు. అనంతరం రేషన్ డీలర్లకు తిరిగి ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడపా వెంకటరమణ, ప్రధాన సలహాదారుడు బోడపాటి ఫణికుమార్, మహిళా అధ్యక్షురాలు అన్నపూర్ణ, ప్రధాన కార్యదర్శి హేమలత, విశాఖ జిల్లా అధ్యక్షుడు అప్పలరాజు, కృష్ణా జిల్లా అధ్యక్షుడు ఖాసిం, ప్రధాన కార్యదర్శి బాపూజీ, కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి వి రాంపండు, కాకినాడ సిటీ అధ్యక్షుడు సోమిశెట్టి కుమార్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

ప్రజాశక్తి - కాకినాడ

కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థులు

కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన పాశవికమైన చర్యను నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఆదివారం జగన్నాధపురం మునసుబు గారి జంక్షన్లో జరిగిన ఈ నిరసన కార్యక్రమం ఎస్ఎఫ్ఐ నగర్ కార్యదర్శి ఎ.వాసుదేవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు మాట్లాడుతూ కలకత్తాలో వైద్య విద్యార్థులపై దాడి యావత్ మహిళా లోకంపై జరిగిన దాడని అన్నారు. వైద్య విద్యార్థులపై దాడి జరిగితే కనీసం స్పందించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొదట్లో దీన్ని ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు కోసం ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో దేశంలో ఆరు నెలల పాప నుండి 60 ఏళ్ల ముసలి వాళ్ళ వరకు మహిళమీద దాడులు పెరిగిపోతున్నాయన్నారు. రాష్ట్రంలో దేశంలో మహిళలకు రక్షణ కల్పించాలని, విద్యార్థులు చదువుకునే పాఠశాల, కళాశాలలో ఆత్మ రక్షణ శిక్షణ తరగతులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ గర్ల్స్ నాయకులు హేమ, హేమలత మాట్లాడుతూ దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, విద్యార్థులపై దాడులు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దాడులను అరికట్టాల్సిన ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర నాయకులు జయరామ్, విపిన్‌కుమార్, వంశీ, విశాల్ ,దివ్య, సింధు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

జల్ జీవన్ మిషన్ నిధులతో నిర్మిస్తున్న వాటర్ ట్యాంకులను త్వరత గతిన పూర్తి చేయాలని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప సూచించారు. ఆదివారం మండలంలోని తిరుపతి, వడ్లమూరు, పులిమేరు గ్రామాల్లో వాటర్ ట్యాంకుల నిర్మాణాలకు జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబుతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే నాణ్యత విషయంలో రాజీ పడరాదని, నాణ్యతాప్రమాణాలను పాటించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు మొయిళ్ళ కృష్ణమూర్తి, దేవళ్ళ వరలక్ష్మిదేవి, తుమ్మల సురేఖ, ఇతర నాయకులు నాని, ఉమామహేశ్వరరావు, సింగన అరవిందకుమార్, కందుల విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

కాకినాడ రోడ్డులో నిలిచిపోయిన ట్రాఫిక్(ఇన్‌సెట్‌లో అడ్డదిడ్డంగా నిలిచిపోయిన వాహనాలు)

ట్రాఫిక్ సమస్య పట్టదా ?

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట నుంచి కాకినాడకు వెళ్లే కెనాల్ రోడ్లో మాధవపట్నం గ్రామం ప్రధాన కూడలి ట్రాఫిక్ సమస్యతో కొట్టుమిట్టాడుతోంది. కాకినాడ, సామర్లకోట, సర్పవరం గ్రామాలకు చేరుకునేందుకు నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగుతుంటాయి. అయితే మాధవపట్నం గ్రామ కూడలిలో నిత్యం ట్రాఫిక్ స్థంభించిపోతుంది. ఉదయం 11 గంటల వరకూ, తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి వరకూ ఇక్కడ ట్రాఫిక్ దారుణంగా మారుతోంది. స్థానికంగా సెంటర్‌ను ఆనుకునే సూర్య గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఉంది. ఆసుపత్రికి వెళ్లే వారితో నిత్యం ఆ ప్రాంతం రద్దీగా ఉంటుంది. శనివారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకూ ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. కాకినాడ మీదుగా వచ్చి సర్పవరం వైపు వెళ్లే భారీ వాహనాలు రాక పోకలు జరిగే సమయంలో అడ్డదిడ్డంగా వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో అత్యవసరాలపై వెళ్లే ప్రజలు, వాహన దారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. శనివారం వాహనాలు తప్పించుకునే అవకాశం లేక పోవడంతో గంటకు పైబడి ప్రయాణికులు నానావస్థలు పడ్డారు. సామర్లకోట - కాకినాడ ప్రధాన రహదారిలో సుమారు రెండు కిలోమీటర్లు దూరం వాహనాలు నిలిచి పోయాయి. ఇటీవలే మాధవపట్నం గ్రామాన్ని ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్ పరిధి నుంచి మార్పు చేస్తూ సామర్లకోట పోలీస్ స్టేషన్ పరిధిలోకి చేర్చారు. దీంతో సామర్లకోట నుంచి ఎనిమిది కిలోమీటర్ల పైబడి దూరంలో ఉన్న ఈ ప్రాంతానికి ట్రాఫిక్ పోలీసులు చేరుకోవడం కష్టతరంగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ట్రాఫిక్ సిబ్బంది తప్పని సరి

తరచూ ట్రాఫిక్ సమస్య ఎదురవుతున్న క్రమంలో మాధవపట్టణం సెంటర్‌లో ఒక ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేదంటే తరచు ఇలాంటి ఇబ్బందులు ఎదురావుతూనే ఉంటాయి. ఈ విషయంలో పోలీస్ ఉన్నతాధికారులు దృష్టిపెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు నేచురల్ ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్, పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నేచురల్ ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నట్లు చిల్డ్రన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో సోమవారం మధ్యాహ్నం నుంచి ప్రారంభమయ్యే ఎగ్జిబిషన్‌కు వచ్చిన చిత్రాల్లో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి బహుమతులను ప్రధానం చేస్తామన్నారు. విజేతలకు చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు బుద్ధా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగే ముగింపు సభలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబు రాజు చేతుల మీదుగా బహుమతులను అందిస్తామన్నారు. ఈ సభలో ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు తోటకూర సుబ్బారావు, కర్రి నాగేశ్వరరావు, పొన్నగంటి శ్రీనివాస్, దేశపల్లి వరహాలరాజు, అల్లాడ రమణ పాల్గొంటారని తెలిపారు.

శారీరక వ్యాయామంతో ఎముకల గట్టిదనం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

శారీరక శ్రమ చేయడం వలన ఎముకలు గట్టి పడతాయని ఫిజియోథెరపీ వైద్యులు డాక్టర్ కె. వెంకటరమణ అన్నారు. ఆదివారం రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చిన్నతనం నుంచి ఎముకలు బలంగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. 20 ఏళ్ల వరకు ఎముకల సాంద్రత పెరిగి 35 ఏళ్ల తర్వాత తగ్గుతుందన్నారు. ఎముకలు బలహీనపడితే చిన్న ప్రమాదాలకి విరుగుతాయని అన్నారు. పోషకాహార లోపం, దీర్ఘకాలిక మందుల వినియోగం ఎముకలపై ప్రభావం చూపుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాజా, రాఘవరావు పాల్గొన్నారు.

ఘనంగా పరదేశమ్మ తీర్థం

ప్రజాశక్తి - తాళ్లరేవు

జాతరలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

గ్రామ దేవత పరదేశమ్మ తీర్థం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా డప్పు వాయిద్యాలు, గరగ నృత్యాలతో పదదేశమ్మను గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా సంతపేట సెంటర్లో నిర్వహించిన స్వరలహరి ఆర్కెస్ట్రా ఆహుతులను అలరించింది. కోరంగి ఎస్ఐ పి. సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అమ్మవారి జాతరలో పాల్గొన్న, ఆలయ కమిటీ , యాత్రికులు

ఘనంగా విజయదుర్గమ్మ జాతర

ప్రజాశక్తి-ఆలమూరు

చెముడులంక ప్రధాన కాలువ ఒడ్డున ఉన్న శ్రీవిజయ దుర్గ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జాతర మహోత్సవాల ఊరేగింపు ఘనంగా ప్రారంభించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయం నిర్మించి మూడేళ్ల పూర్తయిన సందర్భముగా గ్రామంలో గరగ ఊరేగింపు, జాతర, తీర్థ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి ఈ అమ్మవారి జాతర చేయుటకు వేద పండితులు, నిర్వాహక కమిటీ నిశ్చయించినారన్నారు. ఆదివారం రాత్రి జాతర ఘనంగా నిర్వహించారన్నారు. 19న తీర్థనైవేద్యాలు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. భక్తులకు ముఖ్య గమనికగా నైవేద్యంలో ఎటువంటి జంతుబలి లేదని, అందరూ పాటించాలని కమిటీ స్పష్టం చేసింది. అమ్మవారికి బూర్లు, పరమాన్నం, వడపప్పు, పానకంతో నైవేద్యముగా మాత్రమే సమర్పించాలని ఆలయ కమిటీ కోరింది. కార్యక్రమంలో తమ్మన వెంకటే శ్వరరావు, తమ్మన వెంకన్న, పాలూరి చిరంజీవి, రాయుడు వెంకటేష్ దంపతులు, అన్నందేవుల కిట్టయ్య, మహిళలు, పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

ముందస్తు తెలుగు భాషా దినోత్సవం

ప్రజాశక్తి-అమలాపురం

వ్యవహారిక భాషోద్యమ నాయకుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి ఆగస్టు 29 తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ముందస్తుగా తెలుగు భాషా సంబరాలు ఆదివారం డాక్టర్ కత్తిమండ ప్రతాప్ నాయకత్వంలో ఘనంగా జరిగాయి. అమలాపురంలో అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షులు డాక్టర్ కత్తిమండ ప్రతాప్ నాయకత్వంలో పట్టణంలోని అంబేద్కర్ కమ్యూనిటీ భవనం ఆడిటోరియంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి ముందు ప్రాచీన ఆధునిక కవుల వేషధారణలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా అమలాపురం ఎంఎల్ఎ అయితా బత్తుల ఆనందరావు విచ్చేసి శ్రీశ్రీ కళా వేదిక చేస్తున్న సాహిత్య సాంస్కృతిక సేవను ప్రశంసించారు. ఈ సందర్భంగా డాక్టర్ కత్తి మండ ప్రతాప్‌ను శాసనసభ్యులు ఆనందరావు ఘనంగా సన్మానించారు. శాసనసభ్యులు ఆనందరావును కత్తిమండ ప్రతాప్ ఘనంగా సన్మానించారు. పలువురు ప్రముఖులను ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఆనందరావు సన్మానించారు.

కొత్తపేట:శ్రీ శ్రీ కళావేదిక 138వ జాతీయ కవి సమ్మేళనం అమలాపురంలోని అంబేద్కర్ కళాభవనంలో ఆదివారం నిర్వహించారు. కొత్తపేట కు చెందిన డాక్టర్ వివివిఎస్. సుబ్బారావు వినిపించిన కవితా గానం పలువురు ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ ఛైర్మన్ డాక్టర్ కత్తి మండ ప్రతాప్, జాతీయ అధ్యక్షులు బాలార్జున సత్యనారాయణ, కొల్లి రమావతి, జిల్లా కన్వీనర్ బివివి.సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు నల్లా నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పంపింగ్ స్కీమ్‌కు రక్షణ గోడ నిర్మించాలి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

తాతపూడి సమీపంలో గోదావరి ఏటి గట్టు పై ఉన్న పంపింగ్ స్కీమ్ భవనానికి రక్షణ గోడ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో ఈ గోడ తుఫాను ఉధృతికి నేలమట్టం కావడంతో ఆ ప్రాంతంలో రక్షణ గోడ కరువయ్యింది. నీటి ఎద్దడి సమయాల్లోనే ఈ పంపింగ్ స్కీమ్ నుంచి గోదావరి నది నుంచి సాగునీటికి వినియోగిస్తారు. అధికారులు మిగిలిన రోజుల్లో ఈ భవనం వైపు కన్నెత్తి కూడా చూడరు. రక్షణ గోడ లేని ప్రాంతంలో కర్రలతో ఏర్పాటు చేశారు. గతంలో ఈ పంపింగ్ స్కీమ్‌లో ఉన్న సామగ్రి చోరీ జరిగిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. భవనంలో విలువైన సామగ్రి, ఉన్న నేపథ్యంలో ఆ ప్రాంతంలో రక్షణ గోడ నిర్మించాలని ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

పంట పొలాల్లోకి డ్రెయిన్ నీరు

చర్యలు చేపట్టాలని కోరుతున్న రైతులు

చెముడులంకలో డ్రెయిన్ నీటితో మునిగిన పంటచేలు

ప్రజాశక్తి-ఆలమూరు

మండలంలోని చెముడులంకలో గత వైసిపి ప్రభుత్వం హయాంలో మెయిన్ డ్రెయిన్‌ను నిర్మించారు. ఇది గ్రామస్తులకు మేలు చేసినా, రైతులు పాలిట శాపంగా మారింది. డ్రెయిన్ నీరు గ్రామంలోని పంట పొలాల్లోనికి వెళ్లడం వల్ల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. దీని నిర్మాణంలో డ్రెయిన్ ఎగువుకు నిర్మిస్తున్నారని దిగువకు డ్రెయిన్ ఏర్పాటు చేస్తే ఇబ్బందులు ఉండవని పలు వాదనలు వినిపించాయి. అయినా ఇంజినీరింగ్ వ్యవస్థ ఇవేమీ పట్టించుకోకుండా డ్రెయిన్ నిర్మించింది. దీనికి సరైన పరిష్కారం తీసుకురావాలని పంచాయతీ సెక్రెటరీ, సర్పంచ్ కు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ డ్రెయిన్ చుట్టుపక్కల ఉన్న సుమారు 100 ఎకరాలు ఉద్యానవన పంటలు డ్రెయిన్‌లో నీటితో నిండిపోతున్నాయని రైతులు అంటున్నారు. రైతులు తమ పంటలు నష్టపోయినా పట్టించుకోవడంలేదని వారు వాపోయారు. ఇకనైనా పంచాయతీ పాలకవర్గం సరైన పరిష్కారం తీసుకురావాలని రైతులు కోరుచున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం: కార్యదర్శి

దీనిపై కార్యదర్శి యు.రేణుకను ప్రశ్నించగా ప్రధాన కాలువలో నీరు ఉదతంగా ఉన్నప్పుడు ఈ సమస్య ఉత్పన్నమవుతోందన్నారు. కాలువలో లెవెల్ దిగువకి వెళ్ళినప్పుడు డ్రెయిన్‌కు ఇబ్బంది లేదన్నారు. ఇది టెక్నికల్ సమస్య అని, దీనిని ఇంజినీరింగ్ వ్యవస్థకు తెలియజేశామన్నారున. అలాగే ఈ విషయాలు ఉన్నతాధికారులకు నివేదించానని ఆమె తెలిపారు.

కాలువ లెవిల్ తగ్గించాం: ఇరిగేషన్ ఎఇ

దీనిపై ఇరిగేషన్ ఏఇ సుబ్బారావును వివరణ అడగగా వేమగిరి, కోటిపల్లి ప్రధాన డెల్టా కాలువలో నీరు ఉదతంగా ప్రవహిస్తున్న మాట వాస్తవమే అన్నారు. దీంతో వివిధ చోట్ల పంట చేలలోకి నీరు వెళ్లిందన్నారు. దీనిపై పలు ఫిర్యాదులు మేరకు ఇరిగేషన్ ఇఇ, ఇరిగేషన్ డిఇ ఆదేశాలతో కాలువ లెవెల్ తగ్గించామన్నారు. సోమవారం ఉదయానికి పరిస్థితిని చక్కదిద్దపడుతుందని తెలిపారు.

గొల్లవిల్లిలో మెగా బ్లడ్ బ్యాంక్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మండల చిరంజీవి యువత

22న గొల్లవిల్లిలో మెగా బ్లడ్ బ్యాంక్

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

మాజీ ఎంపీ, సినీ నటుడు చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా మండల చిరంజీవి యువత ఆధ్వర్యంలో ఈనెల 22న మెగా బ్లడ్ బ్యాంకు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మెగా బ్లెడ్ బ్యాంక్ కార్యక్రమానికి సంబంధించి ఆదివారం మండల చిరంజీవి యువత పోస్టర్లను మండలంలోని గొల్లవిల్లి గ్రామంలో ఆవిష్కరించారు. దీనికి సంబంధించి మండల చిరంజీవి యువత మాట్లాడారు. ఈ నెల 22వ తేదీన సినీ నటుడు చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా గొల్లవిల్లిలో నిర్వహించే రక్తదాన శిబిరాలు సేవా కార్యక్రమాలను వివరించారు. సేవా స్ఫూర్తి కలిగిన వారు చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని మండల చిరంజీవి యవత కోరారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి యువతకు చెందిన కడియం సందీప్, ఆకేటి పల్లంరాజు, సుందరనీడి ఏసుబాబు, నిమ్మకాయల సాయి, గొలకోటి సతీష్, పోలిశెట్టి కన్నా, చీకట్ల శ్రీను, మద్దింశెట్టి ప్రసాద్, గనిశెట్టి వీరు, సత్తి చిన్న, ఆకుల రవి, గుండుమోగుల శ్రీను, నంద్యాల మోహన్, మోటూరి చిన్న, నిమ్మకాయల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ పిఠాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 67 / 2023

Between:
రాయి సత్తిబాబు ....వాది
మరియు
మురాలశెట్టి సూర్యనారాయణ ....ప్రతివాది
To
మురాలశెట్టి సూర్యనారాయణ S/o నాగరాజు, 52 సం॥లువ్యాపారము, D.No.4-3-125/1 సత్యధి యేటర్‌వద్ద, పిఠాపురం, కాకినాడ జిల్లా ...ప్రతివాది

పై నెంబరు దావాలో వాదిగారు ఎన్నిమార్లు బేటా కట్టిననూ మీకు అందుకోకుండా తిప్పి పంపించి వేయుచున్నందున ఈ ప్రకటన పూర్వకముగా మీకు తెలియ జేయునది ఏమనగా, ది. **02-09-2024**వ తేదీన పై కోర్టువారి యెదుట ఉదయం **10 గం॥30** నిముషములకు స్వయంగా గాని న్యాయవాది కృతముగా గాని హాజరు కావలయును అట్లు హాజరు కానియెడల దావాను మీ పరోక్షమున తీర్మానించెదరని తెలియ జేయడమైనది

కొత్తకోటసత్యసూర్యనారాయణ
కాదులూరి రామకమలాసనరెడ్డి
అడ్వకేట్స్, పిఠాపురం

మహారాజశ్రీ ముమ్మిడివరం సివిల్ జడ్జి (Junior Division) వారి కోర్టులో
O.S. No.137 / 2022

Between:
C.B.Agros and Jewelers Pvt,Ltd Rep, by it's Managing Director Chandana Kedarish, rep. by GPA Holder, Billa Mallikarjuna Rao and another ....వాదులు
And
Vasamsetti Satyanarayana Murthy and another .... ప్రతివాదులు

To
D2) Gayatri Heavenly Resorts, Rep. By It's Managing Director, Mr. Bhupathiraju VVSS Varma, Vennela House, 3rd Floor, Road No. 25/A, Jublilee Hills , Shek Peta, Plot No. 321/A2, Hyderabad, State of Telangana, Temporarily Amalapuram.

ఈ పై నెంబర్ దావాను వాదులు మీ పై దావా షెడ్యూల్ ఆస్తులకు హక్కు దారులుగా నిర్ధారించి దావా షెడ్యూల్ ఆస్తులకు పర్మనెంట్ ఇంజన్‌క్షన్ ఉత్తర్వులు మున్నగు పరిహారములు కోరుచూ దావా దాఖలు చేసియున్నారు. దావాతో పాటు గా **I.A.No. 482 / 2022** .అను పిటిషన్‌ను టెంపరరీ ఇంజన్‌క్షన్ ఉత్తర్వులు మున్నగు పరిహారములు కోరుచు మీ పై దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు సమన్లు నిమిత్తం మరియు **I.A.No. 482 / 2022** మీకు నోటీసులు అమలు మీ హాజరు నిమిత్తం వాయిదా **21-08-2024** వ తేదీ అయి ఉన్నది. కావున మీరు వాయిదా రోజున ఉదయం **10-30** గం.ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ వారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను, అట్లు కాని యెడల మీ పరోక్షమందున తీర్మాణింపబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)
శ్రీ కుచ్చర్లపాటి తాతం రాజు
శ్రీ గుత్తుల శ్రీనివాస రావు
ముమ్మిడివరం — అడ్వకేట్స్, ముమ్మిడివరం
18-08-2024 — 9440041751,9440528135